సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం ៖ 3 ៖ జనవరి ៖ 2023





### కొత్త వైద్యులొచ్చేశారు..

జిల్లాలోని ఆయా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు కొత్త వైద్యులొచ్చేశారు. జిల్లాకు కేటాయించిన 25 మంది డీఎంహెచ్‌వోకు సోమవారం రిపోర్టు చేసి విధుల్లో చేరారు. 8లో▸



### నర్సాపూర్‌కు చేరిన 'మెస్రం' పాదయాత్ర

10లో▸

గంగాజల సేకరణ కోసం 143 మంది మెస్రం వంశీయులు చేపట్టిన పాదయాత్ర రెండో రోజుకు చేరింది. సోమవారం ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్‌కు చేరుకున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/20.0

### వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రి వేళలో చలి ప్రభావం తగ్గనుంది.



జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో గరుడ వాహనంలో కొలువుదీరిన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు



ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు

# 'ముక్కోటి' పూజలు

- వైభవంగా వైకుంఠ ఏకాదశి
- వైష్ణవాలయాల్లో బారులు తీరిన భక్తులు

ఆదిలాబాద్‌: ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. వైకుంఠ ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువును ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే ముక్తి ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలోనే జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరాలయం (శ్రీ మార్వాడి ధర్మశాల)కు ఉదయం 5 గంటల నుంచే స్వామివారి దర్శనం కోసం భారీగా బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకులు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఆలయ సంప్రోక్షణ, నిత్యపూజలు చేపట్టారు. గరుడవాహనుడైన శ్రీమన్నారాయణుడికి వేద మంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులతో పాటు అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు దంపతులు, డీఎస్పీ ఉమేందర్‌రావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే పట్టణంలోని మంగమఠంలో సైతం భక్తులు శ్రీరమా సత్యనారాయణస్వామి దర్శనార్థం తరలివచ్చారు.



మంగమఠం శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలు

## న్యూస్‌రీల్

### కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

కైలాస్‌నగర్‌: నూతన సంవత్సరం 2023ను పురస్కరించుకుని పలువురు జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తదితరులు కలెక్టర్‌కు పూలమొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ, పరిశ్రమలశాఖ, దళిత అభివృద్ధిశాఖ, సర్వేల్యాండ్ రికార్డ్స్, డీపీవో, సీపీఓ, జెడ్పీ సీఈఓ, పీఆర్ ఎస్‌ఈ, డీసీసీబీ సీఈఓలు, ఆర్డీవోలు రమేశ్‌రాథోడ్, సురేష్ తదితరులు తమ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కలెక్టర్‌ను కలిసి బ్లాంకెట్లు, నోట్ బుక్కులు, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్లు. నాయబ్ తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేశారు. రెవెన్యూ డైరీ, క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రగతికి అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ ఏడాది చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు.

### 'కమిషనర్ బెదిరిస్తున్నారు..'



కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామన్న

ఎదులాపురం: సర్వేనంబర్ 170లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ప్రజలను ఖాళీ చేయాలంటూ మున్సిపల్ కమిషనర్ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్నకు సీపీఐ నాయకులు విన్నవించారు. సోమవారం ఈ విషయమై సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి వెళ్లి ఎమ్మెల్యేకు వివరించారు. ఈమేరకు ఎమ్మెల్యే స్పందించి వెంటనే కమిషనర్‌కు ఫోన్ చేశారు. ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని సూచించారు. ముందుగా ఎమ్మెల్యేకు వారు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, కార్యవర్గ సభ్యులు రాములు, దేవిదాస్, భాస్కర్, వామన్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ్ తదితరులున్నారు.

# రైతు అభివృద్ధే లక్ష్యంగా..





నాబార్డు వార్షిక రుణ ప్రణాళికను ఇటీవల విడుదల చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- నాబార్డు వార్షిక రుణ ప్రణాళిక ఖరారు
- రూ.4,218 కోట్లు అందించాలని లక్ష్యం
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత

కైలాస్‌నగర్‌: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను నాబార్డు ఖరారు చేసింది. రూ.4218.03 కోట్లతో కూడిన రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఏయే రంగాలకు ఎన్ని కేటాయింపులు ఉండాలనే విధంగా రూపొందించిన ఈ వార్షిక రుణ ప్రణాళికను ఇటీవల కలెక్టర్ సిక్తా పట్నాయక్ నాబార్డు, బ్యాంకర్లతో కలిసి విడుదల చేశారు. అన్నదాత అభివృద్ధే లక్ష్యంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యతనిచ్చారు. అలాగే చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గృహనిర్మాణం, విద్యారంగాలతో పాటు ఇతర రంగాలకు పంపిణీ చేసే రుణ లక్ష్యాలను బ్యాంకుల వారీగా నిర్దేశించారు.

**వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం**

ఏటా మాదిరిగానే ఈ సారి కూడా రుణ ప్రణాళికలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు నాబార్డు తొలి ప్రాధాన్యతనిచ్చింది. వివిధ పంటల సాగుకు సంబంధించి రుణాలు అందించడంతో పాటు,

**రంగాల వారీగా కేటాయింపులు ఇలా..**

| రంగం | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|
| వ్యవసాయం అనుబంధ రంగాలు | 2,563.64 |
| వ్యవసాయం మౌలిక వసతులు | 199.31 |
| ఆహార ఉత్పత్తులు | 486.65 |
| చిన్నతరహా పరిశ్రమలు | 800.0 |
| విద్య | 48.0 |
| గృహ నిర్మాణం | 91.20 |
| సామాజిక మౌలిక వసతులు | 20.37 |
| సౌర ఇంధనం | 8.79 |

వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు, తుంపర, బిందు సేద్యం, బోర్‌వెల్స్, ఉద్యాన పంటలు, పశుసంవర్ధక శాఖకు సంబంధించిన పాడి వృద్ధి, పౌల్ట్రీ, గొర్రెలు, మేకలు, చేపల పెంపకం కోసం టర్మ్ రుణాలను సైతం అందించనున్నారు. రైతులకు ఎద్దుల బండ్లతో పాటు ద్విచక్రవాహనాలకు సైతం లోన్లు ఇవ్వనున్నారు. వ్యవసాయ మౌలిక వసతుల కల్పనలో భాగంగా కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్లు, వేర్‌హౌస్‌ల నిర్మాణాలతో పాటు భూ అభివృద్ధికి సైతం రుణాలు అందించాలని నిర్ణయించారు. వ్యవసాయం తర్వాత విద్య, గృహ నిర్మాణం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సైతం బాగానే నిధులు కేటాయించారు. నాబార్డు ప్రకటించిన రుణ ప్రణాళికను పక్కాగా అమలు చేసినట్లయితే రైతులకు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో ప్రయోజనం చేకూరే అవకాశమేర్పడనుంది. సామాజిక మౌలిక వసతుల కల్పన, సౌర ఇంధనం వంటి రంగాలకు బ్యాంకర్ల నుంచి రుణాలు తీసుకునే వెసులుబాటును కల్పించింది.

**వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం**

అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేలా వార్షిక రుణ ప్రణాళికను సిద్ధం చేశాం. ఇందులో వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత నిచ్చాం. రైతులకు పంట రుణాలతో పాటు పౌల్ట్రీ, డెయిరీ వంటి యూనిట్ల ఏర్పాటుకు సైతం బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయనున్నారు. తద్వారా అన్నదాతకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. బ్యాంకర్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించాం. వాటిని సాధించేలా బ్యాంకర్లు ఆయా రంగాలకు రుణాలు మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి.

– అబ్దుల్ రౌఫ్, నాబార్డు డీడీఎం



విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న పేరెంట్స్

# వినతుల వెల్లువ

- గ్రీవెన్స్‌కు తరలివచ్చిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్‌: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి అర్జీలు వెల్లువెత్తాయి. కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొని పలువురి నుంచి వినతులు స్వీకరించారు. ఆయా శాఖల అధికారులకు వాటిని అందజేసి సాధ్యాసాధ్యాల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో అడిషనల్ కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, ఎస్.నటరాజ్, ఆర్డీవో రమేశ్‌రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

### బడి స్థలాన్ని కబ్జా నుంచి విడిపించాలి..

సర్కారు బడి కోసం కేటాయించిన నాలుగు ప్లాట్లను కబ్జా చేశారని, వాటిని కబ్జాదారుల నుంచి విడిపించి అక్కడ బడిని నిర్మించాలని మావల మండలంలోని దుబ్బగూడ విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు విన్నించుకున్నారు. ఐదు తరగతులు కలిగిన బడిలో 38మంది విద్యార్థులున్నారని, పదేళ్లుగా ఈ బడి అద్దెభవనంలోనే సాగుతుందన్నారు. భవన యజమాని తాళం వేయడంతో తమ పిల్లలు రోడ్డునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పాఠశాల భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని నివేదించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ జరిపి నివేదిక అందించాలని డీఈవో ప్రణీతను ఆదేశించారు.

**పాఠశాలను సందర్శించిన ఎంఈవో..**

డీఈవో ఆదేశాలతో దుబ్బగూడ పాఠశాలను ఎంఈవో జయశీల సందర్శించారు. చెట్ల కింద విద్యార్థులను కూర్చోబెట్టి బోధిస్తున్న ఉపాధ్యాయురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో మాట్లాడారు. ప్రస్తుతం రెండు గదులతో కూడిన భవనంలో పాఠశాల నడుస్తుండగా యజమాని అవసరాల నిమిత్తం ఒక గదికి తాళం వేశారన్నారు. మరో గది ఉన్నా పాఠశాలకు కేటాయించిన ప్లాట్లను అప్పగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కలెక్టర్, ఎమ్మెల్యేను కలిశారన్నారు. తల్లిదండ్రులకు అభ్యంతరం లేకుంటే పాఠశాలను బట్టిసావర్‌గాంకు తరలిస్తామని అక్కడ అన్ని వసతులున్నాయన్నారు. లేకుంటే మరో భవనాన్ని కేటాయించేలా చర్యలు చేపడుతామన్నారు.

**• నష్టపరిహారం అందించాలి**

గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలతో చేలల్లో ఇసుకమేటలు వేయడంతో తీవ్రంగా నష్టపోయాం. నష్టం అంచనాపై సర్వే నిర్వహించి పరిహారం అందించాలని అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా గ్రామాలు, రైతుల వారీగా సర్వేచేయాలని న్యాయస్థానం ఆదేశించింది. కానీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సర్వే నిర్వహించి మాకు నష్టపరిహారం అందించేలా చూడాలి.

– సాంగ్వీ గ్రామ రైతులు, జైనథ్, బేల



**• మా చేలల్లో బోర్లు వేయించాలి**



మేమంతా ఎస్సీ రైతులం. మా పంట చేలల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోరుబావులు ఏర్పాటు చేయాలని విన్నవించాం. భూగర్భజల వనరుల శాఖ అధికారులు మా చేలను సందర్శించి బోరు పాయింట్లను గుర్తించారు. యంత్రాలను త్వరితగతిన గ్రామానికి పంపించి బోర్లు వేసి సాగునీటి వసతి కల్పించాలి. – రైతులు, గిర్నూర్, బజార్‌హత్నూర్

**• పోడు సర్వే చేయడం లేదు..**

మా గ్రామంలోని 35మంది ఎస్టీ రైతులకు పోడు భూములున్నాయి. కొంతమంది భూముల్లో అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు. మిగతా భూములు సాగు చేసుకోనివ్వడం లేదు. పోడు సర్వే నిర్వహించి మాకు పట్టాలు జారీ చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. సర్వే చేపట్టి మాకు భూ హక్కు కల్పించి న్యాయం చేయాలి. – పల్లికే గ్రామ రైతులు, తలమడుగు



# ఉద్రిక్తంగా మారిన కాంగ్రెస్ నిరసన

- సీఎం దిష్టిబొమ్మ దహనానికి విఫలయత్నం
- పోలీసులు, పార్టీ నాయకుల మధ్య తోపులాట

ఆదిలాబాద్‌టౌన్‌: కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన నిరసన కార్యక్రమం ఆందోళనకు దారితీసింది. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ఆ పార్టీ నాయకులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరువురు మధ్య తోపులాట జరిగింది. కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇందులో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయనను రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ఆయనను డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పరామర్శించారు. అంతకు ముందు పోలీసుల తీరును నిరసిస్తూ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించారు.



నాయకులు, పోలీసుల మధ్య తోపులాట



సీఎం కేసీఆర్ ఫ్లెక్సీతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై ప్రధాన ప్రతిపక్షంగా పోరాటం చేస్తే ప్రభుత్వం పోలీసులతో అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు సృష్టించినా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు చరణ్‌గౌడ్, నాహిద్, రూపేశ్‌రెడ్డి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పత్తికి మద్దతు ధర పెంచాలి

- కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎస్ ధర్నా

కైలాస్‌నగర్‌: రైతులు పండించిన పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.15వేలకు పెంచి, చెల్లించాలని ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్క దేవిదాస్ డిమాండ్ చేశారు. పత్తి మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓవైపు పెట్టుబడి పెరగడం, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలకు తోడు మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే క్వింటాల్‌కు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం నాయకులు మడావి గణేశ్, వామన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





ధర్నాలో పాల్గొన్న నాయకులు

## క్లుప్తంగా

### భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తాం


మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఈనెల 21 నుంచి నిర్వహించే కేస్లాపూర్ నాగోబా జాతరలో భక్తులు, మెస్రం వంశీయుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సోమవారం సందర్శించారు. గోవద్, మర్రిచెట్టు, నాగోబా జాతర నిర్వహణ స్థలాల్లో ఏర్పాటు చేయాల్సిన మరుగుదొడ్లను పరిశీలించారు. ఇప్పటికే ఉన్న వాటికి మరమ్మతు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుకుమార్ తదితరులు ఉన్నారు.

### దేశీదారు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై దేశీదారు తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ లక్ష్మణ్‌రావ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం కాపు కాయగా, మహారాష్ట్ర నుంచి బైక్‌పై వేర్వేరుగా వస్తున్న ఆదిలాబాద్‌లోని భాగ్యనగర్‌కు చెందిన సాయికృష్ణ, మహారాష్ట్ర పాటన్‌బోరికి చెందిన శ్రీకాంత్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి మొత్తం 130 దేశీదారు 90ఎం.ఎల్.సీసాలు లభించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు. నిందితులను అదుపులో తీసుకుని దేశీదారు సీసాలతోపాటు బైక్‌లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కాగా ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు సమాచారం అందించగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రాజేశ్వర్, రవీందర్, మోహన్, శారద, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాఘవులు


రాఘవులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లంకా రాఘవులు ఎన్నికయ్యారు. ఖమ్మంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో ఆదిలాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలో చోటు లభించినట్లు ఆయన పేర్కొన్నారు. తనతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా డి.ఆశన్న ఎన్నికైనట్లు తెలిపారు. వీరి ఎన్నికపై టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి పూసం సచి న్, సంఘం జిల్లా నాయకులు స్వామి, పోచక్క, ఆశన్న, రాజక్క హర్షం వ్యక్తం చేశారు.

### దీపం అంటుకొని పత్తి దగ్ధం

తాంసి: ఇంటి ఆవరణలో నిల్వ చేసిన పత్తి తులసిచెట్టు వద్ద పెట్టిన దీపం మంటలు అంటుకొని సోమవారం దగ్ధమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన రైతు మంత్రి రాజు తనకున్న వ్యవసాయ భూమిలో పత్తి సాగుచేశాడు. సుమారు 50 క్వింటాళ్ల పంట దిగుబడి రాగా, ఇంటి ఆవరణలో నిల్వ చేశాడు. సాయంత్రం తులసిచెట్టు వద్ద పెట్టిన దీపం పత్తికి అంటుకుని మంటలు వ్యాపించాయి. కుటుంబసభ్యులు, స్థానికులు అప్రమత్తమై వెంటనే నీళ్లు చల్లి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు పత్తి కాలిబూడిదైంది. దాదాపు రూ.40 వేల నష్టం వాటిల్లింది.




ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికులు(ఫైల్)

# ఆదాయంపై ఆర్టీసీ నజర్

- సంక్రాంతికి ప్రత్యేక బస్సులు
- ఈ నెల 7 నుంచి 13 వరకు సౌకర్యం
- ఐదు డిపోల పరిధిలో 236 స్పెషల్ బస్సులు

**ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక బస్సుల వివరాలు**

| డిపో | బస్సులు |
|---|---|
| ఆదిలాబాద్: | 70 |
| భైంసా: | 22 |
| నిర్మల్: | 48 |
| ఆసిఫాబాద్: | 30 |
| మంచిర్యాల: | 66 |
| ఉట్నూర్: | 0 |
| మొత్తం: | 236 |

మంచిర్యాలఅర్బన్: నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలోకి తెచ్చేందుకు సంస్థ యాజమాన్యం అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటోంది. టికెటేతర ఆదాయానికి కార్గో సర్వీసులు, అయ్యప్పస్వాములకు ప్రత్యేక బస్సులు, సింగరేణి దర్శన్, విహారయాత్రలకు స్పెషల్ బస్సులు నడిపిన ఆర్టీసీ సంక్రాంతికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు సమాయత్తమవుతోంది. పండుగ నేపథ్యంలో విద్యార్థులకు సెలవులు వస్తున్నాయి. దైవదర్శనాలు, పండుగ సందళ్లు షురూ కానున్నాయి. ఈనేపథ్యంలో రాకపోకలు పెరుగనున్నాయి. ప్రయాణికుల రద్దీ దృశ్యా, ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వెళ్లినవారు.. చదువుల నిమిత్తం అక్కడ ఉన్న విద్యార్థులంతా సంక్రాంతికి స్వగ్రామాలకు వస్తుంటారు. ఈనేపథ్యంలోనే ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఆర్టీసీ 236 ప్రత్యేక (స్పెషల్) బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది.

**ఈ నెల 7 నుంచి 13 వరకు..**

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, భైంసా, ఆసిఫాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గతంలో ప్రత్యేక బస్సులు నడిపించినా ఆశించిన మేర ఆదాయం రాకపోవడమో లేక మరేదైనా కారణమో కానీ ఈసారి ఉట్నూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయలేదు. మిగిలిన ఐదు డిపోల నుంచి ఈ నెల 7వ తేదీ నుంచి 13 వరకు జేబీఎస్ వరకు బస్సులు నడుపనున్నారు. ఆదిలాబాద్ డిపో నుంచి 70, భైంసా డిపో నుంచి 22 నిర్మల్ డిపో నుంచి 48, ఆసిఫాబాద్ డిపో నుంచి 30, మంచిర్యాల డిపో నుంచి 66 బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు బస్సుల ఎసమాచారం అందించేందుకు గానూ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఈ నెల 7న 43, 8న 29, 9న 37, 10న 31, 11న 25, 12న 38, 13న 33 బస్సులు నడుపనున్నారు.

**హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు ప్రత్యేక బస్సుల వివరాలు(డిపోల వారీగా)**

| తేదీ | ఆదిలాబాద్ | భైంసా | నిర్మల్ | ఆసిఫాబాద్ | మంచిర్యాల |
|---|---|---|---|---|---|
| 07 | 11 | 04 | 11 | 05 | 12 |
| 08 | 13 | 02 | 03 | 04 | 07 |
| 09 | 09 | 05 | 11 | 05 | 12 |
| 10 | 08 | 04 | 06 | 05 | 08 |
| 11 | 08 | 04 | 10 | 05 | 07 |
| 12 | 11 | 02 | 09 | 05 | 11 |
| 13 | 10 | 02 | 03 | 04 | 14 |

### మరిన్ని బస్సులు నడిపే అవకాశం



సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే మరిన్ని స్పెషల్ బస్సులు నడిపే అవకాశం ఉంది. ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీలే ఉంటాయి. స్పెషల్ బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంటుంది. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి.
– జానీరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

## గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి


గిరిజనుల అర్జీలు స్వీకరిస్తున్న వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి 86 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు సమస్యలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈనెలలో జరిగే నాగోబా జాతర దృష్ట్యా హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతం చేయాలన్నారు. డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏపీవో పీటీజీ భాస్కర్, ఏపీవో జనరల్ భీంరావ్, ఏడీఎమ్‌హెచ్‌వో మనోహర్, ఏవో రాంబాబు, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

- అర్హులందరికీ 'గిరి వికాసం' పథకం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం చిన్నగంగాపూర్ గిరిజనులు వేడుకున్నారు.
- రైతుబంధు సాయం అందించాలని గాదిగూడ మండలం కొటాలకు చెందిన కుడ్మెత జంగుబాయి అర్జీ పెట్టుకుంది.
- ఉట్నూర్ మండలం కల్లూర్‌లో అంగన్‌వాడీ, కమ్యూనిటీలకు భవనాలు మంజూరు చేయాలని గ్రామ గిరిజనులు కోరారు.
- కుటుంబ పోషణ కోసం మేకల కొనుగోలుకు రుణం అందించాలని ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన భుజంగ్‌రావ్ విన్నవించాడు.
- ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు అటవీ హక్కు పత్రం అందించాలని నార్నూర్ మండలం మహాగాంకు చెందిన జాదవ్ జాలమ్ వేడుకున్నాడు.
- డిగ్రీ, బీఎడ్ పూర్తి చేశానని టెట్ ఉత్తీర్ణత సాధించానని తనకు ఏదైన ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా అవకాశం కల్పించాలని ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన అత్రం మౌనిక అర్జీ పెట్టుకుంది.

## కొత్త వైద్యులొచ్చేశారు..

- 25 మందికి పోస్టింగ్
- రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి
- డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్


డీఎంహెచ్‌ఓకు పుష్పగుచ్ఛాలు ఇస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నార్నూర్, బోథ్ సీహెచ్‌సీల్లో కొత్త వైద్యులు కొలువులో చేరారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన వైద్యుల నియామకంలో జిల్లాకు 25 మంది వైద్యులు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారికి రిపోర్టు చేశారు. 24 పీహెచ్‌సీలు, ఒక సీహెచ్‌సీలో వైద్యులు విధుల్లో చేరారు. గత కొన్నేళ్లుగా జిల్లాలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రభుత్వం ఎట్టకేలకు భర్తీ చేసింది. దీంతో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కావడంతో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందనున్నాయి. డీఎంహెచ్‌ఓ జిల్లాకు 34 పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వానికి విన్నవించగా, ప్రస్తుతం 25 పోస్టులు భర్తీ చేశారు. వీటిలో 24 పోస్టులు జిల్లాలోని పీహెచ్‌సీలకు కేటాయించగా, బోథ్ ఏరియా ఆస్పత్రికి ఒక పోస్టు కేటాయించారు. మరో పోస్టు కేటాయించినప్పటికీ ఆ వైద్యుడు సోమవారం విధుల్లో చేరలేదు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**పోస్టింగ్‌లు ఇవే..**

నవీన్‌రెడ్డికి (సొనాల), రాథోడ్ సందీప్‌కుమార్(శ్యాంపూర్), కె.హరీష్ కుమార్(ఇచ్చోడ), ఉడుగు స్వామి(సైద్‌పూర్), వినోద్‌కుమార్ జాదవ్(సైద్‌పూర్), కె.రాంబాబు(దంతన్‌పల్లి), మిథిలేష్ కుమార్(సీహెచ్‌సీ బోథ్), ఎండీ సద్దాం(నేరడిగొండ), వెంకటేశ్(నేరడిగొండ), శ్యాంసుందర్(గుడిహత్నూర్), సాయిప్రియ(గుడిహత్నూర్), మహ్మద్ సర్ఫరాజ్(నర్సాపూర్(టి), జె.హిమాబిందు(నర్సాపూర్(టి), ఇఫతజ్ సకీలియన్(ఝరి), రాథోడ్ సంజీవ్(ఝరి), తూము నిఖిల్‌రాజ్(భీంపూర్(టి)), శ్రవ్యవాణి, అలైక్య, భీంరావు(బజార్‌హత్నూర్), బొమ్మకంటి నైనత(జైనథ్), సుచల(గిమ్మ), ప్రతాప్ నాయక్(పిట్టబొంగరం), గణేశ్(ఇంద్రవెల్లి), వంశీకృష్ణ(బేల)కు పోస్టింగ్‌లు ఇచ్చారు.

## అండర్ ఆర్మ్ క్రికెట్ పోటీల్లో జిల్లా విద్యార్థికి గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్‌తో కోమల్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాల విద్యార్థిని మోహిటి కోమల్ ఇటీవల పంజాబ్‌లో జరిగిన జాతీయస్థాయి అండర్ ఆర్మ్ మహిళల క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. అండర్ ఆర్మ్ క్రికెట్ ఫెడరేషన్ కప్ 2022లో మహిళల విభాగంలో రాష్ట్రం తరపున 11 మంది క్రీడాకారుల టీం పాల్గొంది. ఈ టీంలో కోమల్ ఒకరు. భైంసా పట్టణానికి చెందిన కోమల్ వశిష్ట డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు సాఫ్ట్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ గౌడ్, జిల్లా అండర్ ఆర్మ్ క్రికెట్ కార్యదర్శి సాయికుమార్, వశిష్ట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అఖిల్ సింగ్ ,అధ్యాపకులు ఆమెను అభినందించారు.

### సౌదీలో ఖానాపూర్‌వాసి మృతి


జహీర్(ఫైల్)


ఖానాపూర్: ఉపాధి కోసం సౌదీ వెళ్లిన ఖానాపూర్ వాసి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఆయన స్వ గ్రామమైన మండలంలోని మస్కాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు అబ్దుల్ జహీర్(25).. సౌదీ రాజధాని రియాద్ నగరంలోని మలాస్‌లో గల 14రోడ్‌లోని ఓ ఇంట్లో ఉండేవాడు. మైనస్ డిగ్రీల చలి కారణంగా ఓ గదిలో ఏ ర్పాటు చేసిన రూమ్‌వార్మర్ నుంచి వెలువడిన పొగతో అస్వస్థతకు గురై ఆదివారం మృతిచెందాడు. ఇదే ఘటనలో మరో యువకుడు ఖానాపూర్‌కు చెందిన మోసిన్, నిర్మల్‌కు చెందిన సుమేర్‌లు ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. వార్మ్ హీటర్ లీకేజీ కారణంగా గదికి వెంటిలేషన్ లేక పొగ నిండి ఈ ఘటన చోటుచేసుకుంది.

## చిత్రలేఖనంలో మేటి

కుబీర్: మండల కేంద్రానికి చెందిన సూది హేమంత్ కుమార్ చిత్రలేఖనంలో మేటిగా నిలుస్తున్నాడు. ఇంటర్ చదివి.. జాతీయ, రాజకీయ నాయకుల ఫొటోలను తెల్లకాగితంపై పెన్సిళ్లతో వేసి రంగులు అద్ది అమ్ముతున్నాడు. కెమెరాతో తీసిన ఫొటోలను ఏ సైజ్‌లో చెబితే గీసి ఇస్తున్నాడు. కుబీర్, భైంసా, నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి గిరాకీ ఉంది. ఫోన్‌ద్వారా ఆర్డర్లు, వాట్సప్ ద్వారా ఫొటోలు పంపిస్తే వారికి నచ్చేలా గీసి పంపిస్తున్నాడు. ఫోన్‌పే ద్వారా డబ్బులు ఇస్తున్నారు. ఒక్కో ఫొటో గీసి ఇవ్వడానికి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నాడు. తాను పేదవాడిని, ప్రభుత్వం పట్టించుకోని దుకాణం ఏర్పాటు చేసి మరో నలుగరికి చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించి ఉపాధి కలిగేలా చేస్తానని హేమంత్‌కుమార్ తెలిపాడు.


హేమంత్ కుమార్


పిల్లల ఫొటో



భగత్‌సింగ్ ఫొటో

### పౌల్ట్రీఫాం పరిశీలన

దస్తురాబాద్: మండలంలోని పెర్కపల్లె గ్రామంలో నేషనల్ లైవ్ స్టాక్‌మిషన్ ద్వారా మంజూరైన పౌల్ట్రీ ఫాంను పశుసంవర్ధకశాఖ అధికారి జేడీ శంకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషన్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణం అందిస్తోందన్నారు. రైతులు వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ అప్పని ప్రభాకర్, పశువైద్యాధికారి సుకన్య, ఉప సర్పంచ్ నరేశ్ ఉన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న గంగాధర్

ఉట్నూర్‌రూరల్: కళాశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉమ్మడి జిల్లా గిరిజన గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో గల గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. తరగతి గదులు పరిశీలించారు. నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ హరిత, సీనియర్ అసిస్టెంట్ బాబులాల్, అధ్యాపకులు ప్రతీమ్, శ్రీవాణి, మానస, సుధరాణి, ఎల్లవ్వ, నాగశ్రావణి తదితరులు ఉన్నారు.

### అక్రమ వెంచర్లపై విచారణ

భైంసాటౌన్: పట్టణంలోని పలు అక్రమ వెంచర్లపై స్థానికుల నుంచి లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో మున్సిపల్ వరంగల్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్ సోమవారం భైంసాను సందర్శించారు. ఈ మేరకు ఫిర్యాదుదారులతో మాట్లాడి అక్రమ వెంచర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఆయన ఫిర్యాదుదారుకు తెలిపినట్లు పేర్కొన్నారు.

### జాతీయ వర్క్‌షాప్‌నకు ఎంపీపీ

బోథ్: కేంద్ర పంచాయతీరాజ్ శాఖ తరఫున గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కోసం ఢిల్లీలో ఈనెల 5,6వ తేదీల్లో నిర్వహించే జాతీయ వర్క్‌షాప్‌నకు బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది వివిధ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపిక చేయగా, అందులో శ్రీనివాస్ ఒకరు ఉన్నారు.

## రాష్ట్రంలో రాక్షస పాలన

- డీసీసీ అధ్యక్షుడు డి.ముత్యంరెడ్డి


మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు ముత్యంరెడ్డి

దిలావర్‌పూర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కారు రాక్షస పాలన సాగిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు దిడ్డికింది ముత్యంరెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో సర్పంచులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి సమస్యలపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధర్నా తలపెట్టారు. ఈ ధర్నాకు వెళ్లకుండా డీసీసీ అధ్యక్షుడు డి.ముత్యంరెడ్డిని దిలావర్‌పూర్‌లోని ఆయన నివాసంలో తెల్లవారుజామున పోలీసులు అరెస్ట్ చేశారు. దిలావర్‌పూర్ సర్పంచ్, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగవీరేశ్‌తోపాటు నా యకుడు రవిని అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి మాట్లాడు తూ రాష్ట్ర సర్కారు సర్పంచులను ఇబ్బంది పెడుతోందన్నారు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చె ల్లించకపోగా ఇటీవల సర్పంచుల ఖాతాల్లో జమైన కేంద్రం నిధులనూ దోపిడీ చేసిందన్నారు. సర్పంచుల సమస్యలపై నిరసన తెలుపకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. శాంతియుత నిరసనలనూ అడ్డుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చే శారు. మధ్యాహ్నం పోలీసులు వారిని వదిపెట్టారు.

### కిన్వట్ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

బోథ్: మహారాష్ట్రలోని కిన్వట్ ఎమ్మెల్యే కెరం భీంరావును బీజేపీ కిసాన్‌సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట భూమేష్‌తోపాటు పలువురు నాయకులు సోమవారం కలిశారు. కిన్వట్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా బోథ్ మండలంలో బీజేపీ పార్టీ అంశాలపై చర్చించారు. త్వరలో బోథ్ నియోజకవర్గానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నట్లు తెలిపారు. నాయకులు సాయినాథ్, గంగాధర్, నరేశ్ ఉన్నారు.

## విఠలేశ్వరుని ఆలయంలో చోరీ

- అమ్మవారి బంగారు ఆభరణాలు ఆపహరణ
- డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు


డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసుల బృందం

తానూరు: మండల కేంద్రంలోని విఠలేశ్వరుని ఆలయంలో చోరీ జరిగింది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం..ఆదివారం రాత్రి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.లక్ష విలువ గల అమ్మవారి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం 6 గంటలకు పూజారి సచిన్ పాఠక్ పూజ చేసేందుకు ఆలయానికి వెళ్లాడు. అమ్మవార్లకు సంబంధించిన రెండు తులాల బంగారం ఆభరణాలు కనిపించలేదు. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు తెలిపారు. వారు అందించిన సమాచారంతో ఎస్సై విక్రమ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. నిర్మల్ నుంచి డాగ్‌స్క్వాడ్ బృందాన్ని రప్పించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దొంగలను త్వరగా పట్టుకుంటామన్నారు.

## 25 నుంచి అఖిల భారతీయ బంజారా కుంభమేళా


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీరామ్‌మహారాజ్

నార్నూర్: మహారాష్ట్రలోని గోద్రి, జామ్‌నేర్ తాలుకా, జలగావ్ జిల్లాలో ఈనెల 25 నుంచి 30 వరకు నిర్వహించే అఖిల భారతీయ బంజారా కుంభమేళాను విజయవంతం చేయాలని కుంభమేళా నిర్వహణ కమిటీ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ పరుసురాం నాయక్ కోరారు. మండలంలోని చోర్గావ్ గ్రామంలోని శ్రీ సంత్ మూర్తి రాములు సంస్థన్ పీఠాధిపతి శ్రీ సంత్ శ్రీరాం మహారాజ్ సోమవారం కుంభమేళా కరపతాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారతీయ ధర్మజాగరణ సమన్వయ సమితి (తెలంగాణ) ఆధ్వర్యంలో కుంభమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీన్ని విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్‌నాయక్, నర్సోడ్, బరప్‌సింగ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



### వృథాగా భగీరథ నీరు

ఖానాపూర్: పట్టణ శివారులోని ఇంద్రనగర్ సమీపంలో గల మస్కాపూర్ వంతెన వద్ద సోమవారం భగీరథ పైప్‌లైన్ పెద్దఎత్తున లీకేజీ అయింది. పైప్‌లైన్ మధ్యలో ఊడిపోవడంతో నీరు వృథాగా పోతోంది. ఇప్పటికైన అధికారులు వెంటనే మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జేఈ కృష్ణ వివరణ కోరగా, సుర్జాపూర్, మస్కాపూర్ పంచాయతీల పరిధిలో లీకేజీల మరమ్మతు కారణంగా కలుషిత నీరు రాకుండా గ్రిడ్ సిబ్బంది నీటిని వదిలారని అన్నారు.

### ఫిజియోథెరపిస్ట్‌పై దాడి

నిర్మల్: జిల్లాకేంద్రంలో సోమవారం సాయంత్రం ఫిజియోథెరపి వైద్యుడిపై ఓ వర్గం యువకులు మూకదాడికి పాల్పడ్డారు. పట్టణ సీఐ శ్రీనివాస్, స్థానికులు తెలిపిన వివరాలు.. స్థానిక డాక్టర్స్‌లైన్‌లో గల ఫిజియోథెరపిస్ట్ నరేస్‌పై ఓ వర్గం యువకులు దాడికి పాల్పడ్డారు. ఇందులో ఎనిమిదిమందిని గుర్తించగా, అందులో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఇద్దరు మహిళల్లో ఒకరు గతంలో ఇదే వైద్యుడి ఆస్పత్రిలో సిబ్బందిగా పనిచేయగా, ఆమెకు అడ్వాన్స్ కింద రూ.10 వేలు ఇచ్చారు. ఆ తర్వాత ఆమె విధులకు హాజరుకాలేదు, అడ్వాన్స్ డబ్బులు తిరిగి ఇవ్వలేదు. ఈక్రమంలో సోమవారం సదరు మహిళ ఆస్పత్రి వద్ద కనిపించగా, అడ్వాన్స్ డబ్బులు అడిగారు. ఈనేపథ్యంలో జరిగిన వాగ్వాదంలో సదరు మహిళలతో పాటు వారికి సంబంధించిన యువకులు ఆస్పత్రిలో ఫిజియోథెరపి వైద్యుడిపై దాడికి దిగారు. అడ్డుగా వచ్చిన మహిళ సిబ్బందిని కొట్టారు. రక్షణకోసం పక్కనున్న ఆస్పత్రిలో పరుగెత్తినా అక్కడికి వెళ్లి దాడి చేశారు. స్థానిక వైద్యులు, వైద్యసిబ్బంది అడ్డుకోవడం, పోలీసులు రావడంతో వారంతా చెల్లాచెదురైనట్లు వివరించారు. ఈమేరకు ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

**వైద్యుల నిరసన**

ఫిజియోథెరపి వైద్యుడు నరేస్‌పై దాడి చేయడాన్ని ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులందరూ నిరసన వ్యక్తం చేశారు. బాధితుడిని పరామర్శించారు. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకూ వెనుకాడమని పేర్కొన్నారు.